

బొబ్బిలి ఎఎంసి ఛైర్మన్‌గా బొమ్మి శ్రీనివాసరావు





బొమ్మి శ్రీనివాసరావు తెంటు పార్వతి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఛైర్‌పర్సన్‌గా తెంటు పార్వతి నియమితులయ్యారు. ప్రభుత్వం ఎఎంసి కార్యవర్గాన్ని గురువారం ప్రకటించింది. ఛైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు... తెర్లాం మండలం కూనాయవలస ఎంపిటిసి సభ్యులుగా ఉన్నారు. ఆయన గతంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులుగా పనిచేశారు. వైస్ ఛైర్‌పర్సన్ తెంటు పార్వతి బొబ్బిలి మున్సిపాలిటీలో కౌన్సిలర్. ఎఎంసి గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మరో 18మంది సభ్యులను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిటీకి వైసిపి నాయకులు అభినందనలు తెలియజేశారు.

కోటలో 'తానా' కుంపటి

- టిడిపిలో కలకలం రేపుతున్న గొంప ఎంట్రీ
- నియోజకవర్గ కేంద్రంగా భారీ బల ప్రదర్శన
- కోళ్ల కుటుంబానికి ఎదురుదెబ్బ?

ప్రజాశక్తి - జామి

రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమంటారు. ఎస్.కోట నియోజక వర్గంలోని తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న పరిణామాలు చూస్తే అది నిజమేనని చెప్పక తప్పదు. తాజాగా నియోజకవర్గ కేంద్రంలో జరిగిన తానా చైతన్య సదస్సు టిడిపిలో పెద్ద కుంపటినే రాజేసింది. ఐదు మండలాల్లోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో గందరగోళాన్ని సృష్టించింది. ఒక్క సారిగా తానా సభతో తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా విడిపోయే పరిస్థితులు నెలకొనడంతో ప్రస్తుతం జిల్లా టిడిపి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నిన్నటి వరకు దశాబ్దాల కాలంగా ఎస్.కోట రాజకీయాల్లో ఏకచక్రదిపత్యాన్ని చెలాయించిన కోళ్ల కుటుంబానికి ఈ పరిణామం మింగుడు పడని పరిస్థితి. తానా సదస్సు జరిగిన తీరును పరిశీలిస్తే, ఇది ఖచ్చితంగా కోళ్ల రాజీయానికి చెక్ పడుతుందా...? అన్న అనుమానం రాక తప్పదు.

శృంగవరపుకోట నియోజకవర్గంలో అత్యధిక సార్లు గెలుపొందిన పార్టీ టిడిపి. పైగా గెలిపొందిన వారిలో కోళ్ల కుటుంబ సభ్యులే ఉన్నారు. ముఖ్యంగా కోళ్ల అప్పలనాయుడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్‌టిఆర్‌కు ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అప్పటి నుంచి ఎన్ టి ఆర్ కుటుంబానికి, కోళ్ల కుటుంబానికి సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వరుసగా ఎస్.కోట రాజకీయాన్ని శాసిస్తూ వచ్చారు. అయితే తాజాగా నియోజకవర్గ పరిణామాల్లో కోళ్ల లలితకుమారికి చెక్ పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత నాలుగైదు నెలలుగా వేపాడకు చెందిన ఎన్ ఆర్‌ఐ గొంప కృష్ణ ఎస్.కోట టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఎస్.కోటలో జరిగిన తానా సదస్సుకు గొంప కృష్ణను ఆహ్వానించడం, కోళ్ల లలితకుమారి అనుచరులు ఆ సదస్సుకు హాజరు కాకపోవడం ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది. ఆయనకు టిక్కెట్ ఇస్తే, టిడిపికి, ఎన్‌టిఆర్ కుటుంబానికి సన్నితులైన కోళ్ల పరిస్థితి ఎంటి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి తానా సదస్సుకు, టిడిపి పార్టీకి సంబంధం లేదు. కానీ సదస్సుకు హాజరైన వారంతా టిడిపి నాయకులు, కార్యకర్తలే కావడం విశేషం. జామి, వేపాడ, ఎస్.కోట, కొత్తవలస మండలాల నుంచి జనాన్ని తరలించడంలో ముఖ్య భూమిక పోషించింది టిడిపి నాయకులే. ఆ నాయకులంతా కోళ్ల లలితకుమారి నాయకత్వాన్ని పార్టీలో తొలి నుంచీ వ్యతిరేకించిన వారు కావడం మరో విశేషం. తానా సదస్సు ద్వారా రైతులకు సేవా కార్యక్రమం మాత్రమే అనుకొని సరిపెట్టుకోవడానికి తావులేదు. ఎందుకంటే ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విశాఖ టిడిపి పార్లమెంట్ ఇంచార్జ్ ఎం.శ్రీ భరత్ హాజరయ్యారు. పోనీ తానా సదస్సు గానే చుద్దామనుకుంటే, విశాఖ నాయకుడు భరత్ వచ్చినపుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి లలితకుమారి గానీ, రాష్ట్ర నాయకులు కోళ్ల రాంప్రసాద్ గాని రాకపోవడం పట్ల గుసగుసలు వినిపిస్తున్నాయి. కోళ్ల లలితకుమారికి చెక్ పెట్టేందుకే కృష్ణను భరత్ తెరపైకి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

సర్వే ప్రక్రియ రైతుల పాలిట వరం

- జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు
- ప్రారంభమైన శాశ్వత భూ హక్కు పత్రాలు పంపిణీ
- బొబ్బిలి వేదికగా తొలి విడత కార్యక్రమం



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు.. భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం బొబ్బిలి వేదికగా గురువారం ప్రారంభమయ్యింది. ఇప్పటి వరకు జిల్లాలో 180 గ్రామాల్లో రీ సర్వే పూర్తి కాగా గురువారం బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో తొలి విడత పట్టాల పంపిణీని చేపట్టారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులు పాల్గొని రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వారి భూములకు శాశ్వత హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియ రైతుల పాలిట వరం అని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, కష్ట నష్టాలు తీరిపోతాయని అన్నారు. రైతుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని, అధికారులు, సిబ్బందే రైతుల వద్దకు వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు. ఆర్‌డిఒ శేష శైలజ ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలను వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో 79 గ్రామాల్లో 1.50 లక్షల ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశామని, 300 మందికి హక్కులు కల్పించామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. రూపాయి ఖర్చు లేకుండా సులభతర విధానంలో రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. రైతుల వద్దకే సర్వే, రెవెన్యూ సిబ్బంది వచ్చి సేవలు అందిస్తారని చెప్పారు. రీ సర్వే ప్రక్రియ ద్వారా రైతులకు శాశ్వత హక్కులు లభిస్తాయని వివరించారు.

కార్యక్రమంలో భాగంగా తెర్లాం రెవెన్యూ సిబ్బంది ప్రదర్శించిన లఘు నాటిక విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళి కృష్ణ, బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం, బాడంగి మండలాల తహశీల్దార్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బోచర్‌ను ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ విసి జిఎస్ఎన్ రాజు, ప్రతినిధులు

17న సెంచూరియన్ స్నాతకోత్సవం

- గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ రాక
- 10 మందికి బంగారు పతకాలు : విసి జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవాన్ని ఈనెల 17న ఘనంగా నిర్వహించనున్నామని వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ వస్తున్నట్లు తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 17న సాయంత్రం 4.30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. వేడుకలకు ముందుగా కార్యక్రమానికి ముందుగా రిహార్స్ కూడా నిర్వహిస్తామని చెప్పారు. గౌరవ అతిథిగా కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎం.సేవలనాయక్ (ఐఎఫ్ఎస్) వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ డిబి ప్రసన్న పట్నాయక్ హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా టాప్ ర్యాంకులో నిలిచిన విద్యార్థులకు 10మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామని, ప్రొఫెసర్ శాంతమ్మ ప్రోత్సాహంతో ఒక పేద విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమతిని అందజేస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్, పారా మెడికల్ సైన్సెస్‌కు సంబంధించి వివిధ బ్రాంచ్‌లలో టాపర్లకు గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేయనున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంబిఎ కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు వివరించారు. వచ్చే ఏడాది నుంచి ద్వంద్వ డిగ్రీలు (డ్యుయల్) అందజేయనున్నామన్నారు. దీనికి సంబంధించి వెస్టెర్న్ సిడ్నీ యూనివర్శిటీతోను, న్యూజిలాండ్ యూనివర్శిటీలతోను చర్చలు జరిగాయన్నారు. ఇక్కడ విద్యార్థులకు ల్యాబ్ సదుపాయం, ఇంటర్న్‌షిప్ శిక్షణ, యంత్రాల తయారీ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందువల్లనే ఇక్కడ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. ఇదిలా ఉండగా విద్యార్థులు ఇన్ స్టా మనీ యాప్ రూపొందించారని, దీంతోపాటు విద్యార్థులు విమానం డిజైన్ తయారు చేస్తున్నారని వివరించారు. వర్సిటీ అధ్యాపక బృందం అంతా కలిసి ప్రత్యేక విమానాన్ని తయారు చేస్తున్నారని, దీన్ని తమ వర్సిటీ పేటెంట్‌తో విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. తమ వర్సిటీకి ఇప్పటికే 7పేటెంట్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డీన్ డాక్టర్ కృష్ణమూర్తి, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ సన్నీ డియోల్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం

అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తెలుగు జాతి కోసం, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అప్పటివరకు మద్రాసీలుగా పిలవబడ్డ తెలుగువారికి ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని, తద్వారా తెలుగు జాతికి ఒక గుర్తింపును, గౌరవాన్ని పొట్టి శ్రీరాములు సముపార్జించారని అన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన ఖ్యాతి నిలిచిఉంటుందని ఛైర్మన్ అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి నిర్మలాదేవి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం : కలెక్టర్

రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి అజరామరమని కలెక్టర్ సూర్యకుమారి కొనియాడారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో, గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌డిసి పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన...

విజయనగరం కోట : తన సిద్ధాంతం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు కొనియాడారు. పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగార్రాజు, కర్రోతు నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో పాటు మిగుల ఉపాధ్యాయుల
సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల బదిలీల్లో సమస్యలతో పాటు మిగుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డిఇఒ లింగేశ్వరరెడ్డికి వినతి అందజేశారు. ఉపాధ్యాయుల కుటుంబసభ్యులు అనారోగ్యం బారిన పడితే ప్రిఫరెన్షియల్ కేటగిరి వినియోగించుకునేందుకు తగిన సర్టిఫికేట్ల మంజూరుకోసం మెడికల్ బోర్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్‌లో ప్రమోషన్లకు అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రాంతం ఖాళీలు చూపించేందుకు తగిన స్పష్టత ఇవ్వాలన్నారు. సబ్జెక్టు కన్వర్షన్ ఇచ్చిన ఉపాధ్యాయులకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన వారందరికీ పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వడంతో పాటు అదనపు పాయింట్లు ఇవ్వాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3వ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల రోలుతో సంబంధం లేకుండా అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయుల బదిలీలకు చివరితేదీగా డిసెంబరు నెల ప్రకటించారని, ఏ పాఠశాలలో ఎన్ని ఖాళీలు వున్నాయి, ఎవరు మిగులు ఉపాధ్యాయులన్న విషయం ప్రకటించలేదని తెలిపారు. మిగుల పోస్టుల వివరాలు ప్రకటించి, దరఖాస్తు చివరితేదీని పొడిగించాలని కోరారు. ఏదైనా పాఠశాలకు ఎల్ఎఫ్ఎల్ ఉపాధ్యాయుడ్ని కేటాయిస్తే వారి బదులుగా మిగులు ఉపాధ్యాయులుగా చూపించరాదన్నారు. వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న తెలుగు పండిట్, హిందీ పండిట్, పి.టి.లకు కావలసిన స్థానాలు కేటయించాలన్నారు. వినతినిచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్ కె.ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు.డి.రాము, జిల్లా నాయకులు తిరుపతి నాయుడు తదితరులు ఉన్నారు.



డిఇఒకు సమస్యలను వివరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

వైస్ అడ్మిరల్ బిస్వరత్ దాస్ గుప్తా



గౌరవ వందనం స్వీకరిస్తున్న బిస్వరత్ దాస్ గుప్తా

విజయనగరం రూరల్ : సైనిక స్కూలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వరత్ దాస్ గుప్తా అన్నారు. లోకల్ బోర్డు ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ 133వ సమావేశంలో పాల్గొనేందుకు కోరుకొండ సైనిక పాఠశాలకు గురువారం ఆయన విచ్చేశారు.

అడ్మిరల్‌కు ప్యాలెస్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి స్వాగతం పలికారు. అందుకున్నారు. అనంతరం వార్ మెమోరియల్ వద్ద యుద్ధ వీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు పాఠశాల సీనియర్ డివిజన్ ఎన్‌సిసి క్యాడెట్‌లు అందించిన స్మార్ట్, కలర్ ఫుల్ గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలించారు. తదనంతరం అడ్మిరల్ సింగ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశానికి ఎమ్‌పి, లెఫ్టినెంట్ జనరల్ కె.సురేంద్రనాథ్, పివిఎస్‌ఎం (రిటైర్డు) సభ్యుడు బి.చంద్రశేఖరరావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ ఎ.సూర్య కుమారి, ఎయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. పలు విషయాలపై చర్చించారు. పాఠశాలలో సాధించిన పురోగతి గురించి ప్రిన్సిపల్ కులకర్ణి సభ్యులకు వివరించారు. పాఠశాల చేపట్టిన అన్ని ప్రాజెక్టులు, వాటి స్థితిగతుల గురించి కూడా ప్రిన్సిపాల్ బోర్డుకు తెలియజేశారు. సిబ్బంది నిరంతర కృషితో పాఠశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాను కోరుకుంటున్నట్లు ఛైర్మన్ తెలిపారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇందిరాగాంధీ అయ్యప్ప ఐటిఐపై
చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరాగాంధీ అయ్యప్ప ఐటిఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇందిరాగాంధీ అయ్యప్ప ఐటిఐలో ఇష్టారాజ్యంగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్షల కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు రాయిస్తున్నామని చెప్పి, పక్కనే ఇందిరాగాంధీ అయ్యప్ప ఐటిఐ సిబ్బంది పుస్తకాలు పట్టుకొని కావాల్సిన జవాబు పత్రాలన్నీ అందిస్తున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణపై అధికారులకు ఫోన్లో సమాచారం అందించాలని చూస్తే ఐటిఐ అధికారులు అందుబాటులోకి రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇందిరాగాంధీ అయ్యప్ప ఐటిఐ కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డేవిడ్, వర్ధన్, జానీ, తేజ, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్తు పొదుపుపై వ్యాసరచన పోటీలు

బొబ్బిలి : విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు గురువారం విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ శాఖ ఇఇ పూడి హరి మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడిఎలు ఎం.లక్ష్మినారాయణ, భానునాయుడు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజైన్ మార్చండి.. లేకుంటే భూమైనా ఇవ్వండి

గుడివాడ, డబ్బిరాజుపేట రైతుల డిమాండ్

ప్రజాశక్తి-వేపాడ

పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని, లేకుంటే భూమికి బదులు మరోచోట భూములైనా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. పోలవరం ఎడమ కాలువ భూసేకరణ కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్‌దొర ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గుడివాడ, డబ్బిరాజుపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ సిహెచ్.జగన్, రైతులు అభ్యంతరాలను తెలియజేశారు. వేపాడ నుండి శృంగవరపుకోట మండలం వీరనారాయణం వరకు ప్రస్తుతం రూపొందించిన డిజైన్ బదులు కొద్దిగా పైనుంచి వెళ్తే బ్రాజీపేట, కరకావలస, గుడివాడ, జాకేరు, రామస్వామిపేట రైతులకు అన్యాయం జరగదన్నారు. కాలువ కోసం భూములు లాక్కొంటే తిండిగింజలు కూడా దొరకవన్నారు. ప్రభుత్వం సేకరించిన భూమికి బదులుగా మరోచోట తమకు భూములివ్వాలని రైతులు పట్టుబట్టారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఎస్‌డిసి వెల్లడించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు, సర్పంచులు మిడతాన గోపి, దండుపాటి సత్యం, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, నారాయణమూర్తి, అర్జునరావు, మజ్జి శ్రీను, చిన్న, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మనిషి జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మెరుగైన జీవితం లభిస్తుందని, దాన్ని విద్యార్థి దశ నుంచే అల అర్చుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు జి.సౌజన్యదేవి అన్నారు. గురువారం జెఎన్‌టియు కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆరోగ్యంపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆమె మాట్లాడుతూ జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం మంచిదన్నారు. సెల్ ఫోన్లు విజ్ఞానం కోసం వాడాలని, అనవసరంగా వాడకూడదని అన్నారు. విద్యార్థి జీవితంలో సమయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, మంచి ఆహార అలవాట్లు ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమన్నారు. సదస్సులో అధ్యాపకులు నాగరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

18న జిల్లా సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : జిల్లా సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక తేదీ ఈనెల 18న విజయనగరం రాజీవ్ స్టేడియం వద్ద జరుగుతుందని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణంరాజు, భగవాన్ దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23నుండి 25వరకు యలమంచిలిలో జరుగు అంతర్ జిల్లా పోటీలకు వెళ్తారని తెలిపారు. 2006 జనవరి 1 తరువాత పుట్టినవారు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, పుట్టిన తేది సర్టిఫికేట్ తీసుకొని రావాలని తెలిపారు. ఎంపికలు 18వ తేదీ మధ్యాహ్నం 2గంటల నుండి జరుగుతాయన్నారు.

సత్యా కళాశాలలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ కళాశాలలో గురువారం పెస్ట్ కంట్రోలింగ్ పరిశ్రమలు, వాటిలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు రిసోర్స్ పర్సన్ గా ఎన్‌వియు కంపెనీ హైదరాబాద్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ కాత్రాజు హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. బెస్ట్ కంట్రోలింగ్ ఎలా చేయాలి దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశ్రమల్లో ఉండే ఉద్యోగ అవకాశాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఎలా ఉంటాయి? వాటిలో ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఉంటాయి అనే అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమని తెలియజేశారు.

సిఎంకు కృతజ్ఞత లేఖలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతా లేఖలు పంపే కార్యక్రమం చేపట్టారు. గురువారం స్థానిక కస్పా హైస్కూలు విద్యార్థులు ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుంటూ వారి భవిష్యత్తుకు బాసటగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ సుమారు 7వేల మంది విద్యార్థులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు రాశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాసిన లేఖను చూపిస్తున్న విద్యార్థిని, డిప్యూటీ మేయర్ శ్రావణి

అండర్-17 క్రికెట్ జట్టు ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 17 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పూర్తి అయ్యింది. గురువారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపికకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో బాలురు16మంది, బాలికలు 16 మంది, స్టాండ్ బాయ్‌గా ముగ్గురు చొప్పున ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ తెలిపారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బంగార్రాజు, నాని ఆధ్వర్యాన ఎంపికలు జరిగినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయి.

మాజీ సిఎస్ సమీర్ శర్మ 17న జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి చీఫ్ ఎక్జిక్యూటివ్ అధికారి శమీర్ శర్మ ఈనెల 17 న జిల్లాకు రానున్నారు. ఆరోజు కలెక్టరేట్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. సంబంధిత విభాగాల అధికారులంతా హాజరు కావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు.

23న మ్యూజిక్ అకాడమీ ఏర్పాటు

విజయనగరం కోట : నగరానికి చెందిన దశిగి పేర్రాజు శతజయంతి ఉత్సవాలు సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మ్యూజిక్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపకులు ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ డివి శ్రీకాంత్, అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్‌రావు, ప్రిన్సిపాల్ మండపాక రవి తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

22న రాజాంలో చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - వంగర

ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న రాజాంలో పర్యటించనున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని రాజాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నారాయణరావు అధ్యక్షతన గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రాజధాని విషయంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఇసుక, మద్యం ధరలు ఇష్టానుసారంగా పెంచేసి ప్రజా ధనాన్ని దోచుకుంటున్న వైసిపి ప్రభుత్వం గద్దె దిగేందుకు రోజులు దగ్గిరపడ్డాయన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి మోహనరావు, బొత్స వాసుదేవరావు నాయుడు, లచ్చుబుక్త ధనలక్ష్మి, కృష్ణమూర్తి, రవి, భౌరోతు రాంబాబు, గణపతి వేగిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్యాయం చేస్తున్న కేంద్రం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు అన్యాయం చేస్తోందని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ ఆరోపించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రైళ్లలో వృద్ధులకు ఇచ్చే రాయితీలు పునరుద్ధరించే పరిస్థితి లేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం అన్యాయమన్నారు. రైల్వే శాఖ నెమ్మదిగా సేవా రంగం నుండి వ్యాపార రంగంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశం అభివృద్ధి రంగంలో ప్రయాణిస్తుందని చెప్పే ప్రధానమంత్రి మోడీ వృద్ధులకు రైల్వే శాఖ చేస్తున్న అన్యాయంపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు పల్లా ముహనరావు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న జగదీశ్వరరావు

జగదీశ్వరరావుకు అభినందన

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం ఎన్‌జిఒ సంఘం యూనిట్ గౌరవ అధ్యక్షుడిగా మండలంలో పినతాడివాడ సచివాలయ కార్యదర్శి ఎం.జగదీశ్వరరావును ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం భోగాపురంలో ఎన్‌జిఒ సంఘం భోగాపురం యూనిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో జగదీష్ రావును అధ్యక్షుడిగా యూనిట్ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను గురువారం తోటి ఉద్యోగస్తులతో పాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు అభినందించారు.

కూలి గిట్టుబాటుపై అవగాహన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సరసనాపల్లి పంచాయతీలో పోరెడ్డివాని చెరువు పనులను ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ గురువారం పరిశీలించారు. ఉపాధి వేతన దారులకు కూలి గిట్టుబాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతలు ప్రకారం పనిచేస్తే రూ.257 గిట్టుబాటు అవుతుందని తెలిపారు. ఉపాధి పనులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలు చేయాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తప్పనిసరిగా కూలీల హాజరు, ఫొటో అప్లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయని తెలిపారు. లేకుంటే వేతనాలు రావని వెల్లడించారు. పనులు చేసే ముందు వెంటనే ఫోటో అప్లోడ్ చేయాలని అన్నారు. పనుల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనుల వద్ద జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడి రైతులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. పాల కేంద్రంలో పాలు పోస్తూ విశాఖ డైరీ అందించిన సుఖీభవ కార్డు కలిగిన పాడి రైతులకు భోగాపురం పాలకేంద్రం అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపిపి బాలిపల్లి జ్యోతి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎన్నో సౌకర్యాలు అందిస్తున్న విశాఖ డైరీ సేవలను ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. పాడి రైతులకు గత సంవత్సరం సరఫరా చేసిన పాల ఆధారంగా త్వరలోనే డైరీ ద్వారా సంక్రాంతి బోనస్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ వాసుబాబు, బాలిపల్లి సత్తిబాబు, వేతన కార్యదర్శి రామకృష్ణ, దుబ్బాక బాబురావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు.. అండర్-17 స్కూల్ గేమ్స్ త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుండి 19 వరకు కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం బి.లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

అప్సా ఆధ్వర్యంలో గణిత పరీక్షలు

ప్రజాశక్తి- భోగాపురం

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావాడ విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రతిభా పరీక్షను గురువారం రాశారు. ప్రిన్సిపల్ బండారు అప్పలనారాయణ, గణిత ఉపాధ్యాయులు అప్పరబుక్త అప్పలనర్సి, విద్యార్థులు పాల్గొన్నారు.

వంగర : ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వివేకా మాస్టర్ మైండ్ పాఠశాలలో విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, ఉపాధ్యాయులు చక్రపాణి, లక్ష్మునాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి- గరివిడి

అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వే గేటు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య జిల్లా సంఘం ఉపాధ్యక్షులు వివిఎస్ఎస్ఎన్ గుప్తా పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యడ్ల సూర్యరావు, గరివిడి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు యస్. వెంకటరాజు, ఉపాధ్యక్షులు జగన్నాధ రావు, కార్యవర్గ సభ్యులు అమర వాసుదేవరావు, పి. సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తడి, పొడి చెత్తలు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ తెలిపారు. గురువారం క్లాప్ కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలో పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. స్థానిక ఆదిత్యా విద్యాలయం, విశ్వంభర పాఠశాలల్లో తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసే విధానంపై, హోమ్ కంపోస్టింగ్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులు తలిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస రావు, మేస్త్రీ నాగ మధు, ఆదిత్యా విద్యాలయం కరస్పాండెంట్ వి. సూరిబాబు, హెచ్ఎంవి. అమృత, విద్యార్థులు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పాలవలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన గొలగాన శ్రీను మతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు గంగమ్మకు వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయం కింద రూ.10వేలు నగదును గురువారం ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు అందించారు. మొత్తం రూ.లక్ష బీమా సొమ్ములో మిగిలిన రూ.90 వేలు గంగమ్మ వ్యక్తిగత ఖాతాలో జమవుతాయని వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బి. శ్రీనివాసరావు, రామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపులో రైస్‌మిల్లర్ హస్తం

పాలిష్ చేసి మార్కెట్‌కు సరఫరా ● అధిక ధరలకు అమ్ముకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

రేషన్ బియ్యం అక్రమ తరలింపు వెనుక బలిజిపేట మండలానికి చెందిన రైస్‌మిల్లర్ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్‌మిల్లుల్లో పాలిష్ చేసి బహిరంగ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో ఇటీవల అర్ధరాత్రి సమయంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకుని, 10.1 టన్నుల బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట మండలం చిలకలపల్లి గ్రామంలో ఉన్న అయ్యప్ప మోడరన్ రైస్‌మిల్లు యజమాని బొడ్డు మోహనరావు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ కూడా రైస్‌మిల్లు యజమాని మోహనరావుకు చెందినదిగా విజిలెన్స్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. బొడ్డు మోహనరావుకు రైస్ మిల్లు ఉంది. రైసు మిల్లుకు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు చెపితే మిల్లు సీజ్ అవుతుందని భయంతో చీపురుపల్లి తరలిస్తున్నట్లు చెప్పి విజిలెన్స్ అధికారులను పక్కదారి పట్టించినట్లు తెలిసింది.



రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన వ్యాను

తక్కువ ధరకు కొని..

వ్యాపారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రేషన్ బియ్యాన్ని కిలో రూ.12 నుంచి 15 వరకు కొనుగోలు చేస్తున్నారు. వీటిని రాత్రిసమయాల్లో రైస్‌మిల్లులకు తరలించి, పాలిష్ చేస్తున్నారు. కొత్తగా ప్యాకింగ్ చేసి బహిరంగ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇలా రేషన్ బియ్యాన్ని సన్నబియ్యం పేరుతో బహిరంగ మార్కెట్‌కు తరలించి ప్రజలను మోసం చేస్తున్నారు. బలిజిపేట మండలంలో ఉన్న రైస్‌మిల్లుల్లో ఎక్కువగా రేషన్ బియ్యం పాలిష్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ బియ్యాన్ని రైసుమిల్లుల్లో పాలిష్ చేస్తున్నట్లు అధికార యంత్రాంగానికి తెలిసినా, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేరాఫ్ పిరిడి

బొబ్బిలి మండలంలోని పిరిడి గ్రామం రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు కేరాఫ్‌గా మారింది. ఇటీవల 10 టన్నులకు పైగా బియ్యం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. గతంలో అనేకసార్లు అధికారులు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. కొన్నేళ్ల క్రితం అక్రమ రేషన్ తరలింపుపై న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన విలేకరులపై పిరిడి గ్రామానికి చెందిన రేషన్ బియ్యం వ్యాపారులు దాడి చేశారంటే ఆ అక్రమ వ్యాపారం ఏస్థాయిలో చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం వెనుక ఉన్న రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోటీ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి- భోగాపురం

యువత బంగారు భవిష్యత్తు కోసం పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు జనసేన నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ లోకం మాధవి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక కోసం మెరుగైన శిక్షణ యువతకు ఇస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, పతివాడ వెంకటలక్ష్మి, అప్పుడు దొర, పల్లా రాంబాబు జనసేన కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్రామీణులు మూఢనమ్మకాలు విడనాడి గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు. గురువారం పాతరేగలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల తీరు తెన్నులు వివరించారు. విజ్ఞానం వృద్ధి చెందుతున్న దశలో దెయ్యాలు, భూతాలు వంటి అభూత కల్పనల పట్ల ఆకర్షితులు కావద్దన్నారు. ఇటువంటి మోసాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది చిన్నయ్య, శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పెద్దింటి కృష్ణమూర్తి, గొర్లె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉంటేనే పింఛను

ప్రజాశక్తి-కొత్తవలస

అన్ని అర్హతలు ఉన్నవారికి పింఛను తప్పనిసరిగా వస్తుందని ఎంపిడిఒ వై.పద్మజ తెలిపారు. గురువారం మండలంలోని కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో ఎంపిడిఒ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పింఛన్లకు దరఖాస్తు చేసుకున్న వారితో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కంటకాపల్లి పంచాయతీ కార్యదర్శి మాధవిలత, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, మదిన అప్పలరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కొత్తవలస

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని కొత్తవలస-3 సచివాలయ పరిధిలో ఎర్రవానిపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రాలను అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకుంటే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైస్ సర్పంచ్ పి.చెల్లయ్య, పి.ఎస్.ఎన్. పాత్రుడు, గొరపల్లి రవి, స్థానిక నాయకులు ఆదిరెడ్డి అప్పన్న(నాయుడు), లెంక వెంకన్న పాత్రుడు, మిడతాన దేముడు నాయుడు, వార్డు సభ్యులు ఏడుకొండలు, కంటకాపల్లి సర్పంచ్ మదిన అప్పలరాము, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, చినరావుపల్లి సర్పంచ్ బుసాల దేవుడు, జామి సాల్మన్ రాజు, సూరిబాబు, రవి పాల్గొన్నారు.

బొబ్బిలి : మూడేళ్ల పాలనలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శంబంగికి వార్డు కౌన్సిలర్, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.. ప్రభుత్వ పనితీరుపై సంతృప్తిగా ఉన్నారా? లేదా? సంక్షేమ పథకాలు అందుతున్నాయా?, తదితర అంశాలపై ఆరాతీశారు. సంక్షేమ పథకాలపై మహిళలు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్లు జి.రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస.. లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం టౌన్ : నగరంలోని 37వ డివిజన్ విటి అగ్రహారం బిసి కాలనీలో గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు పై ఆరా తీశారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పథకాలు అమలు అవుతున్న తీరు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి పాలనపై ప్రజల్లో అసంతృప్తి



బాడంగి.. గ్రామంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-బాడంగి

మూడున్నరేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలవలస గౌరు తెలిపారు. గురువారం మండలంలోని ఎరుకలపాక గ్రామంలో టిడిపి ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు రవిబాబు, సింగిరెడ్డి భాస్కర్ రావు, బొంతు త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

బంగార్రాజుపేటలో 'ఇదేమి కర్మ'

డెంకాడ : మండలంలోని బంగార్రాజుపేట గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో గురువారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అరచకాలు అధికమయ్యాయన్నారు. విపరీతంగా నిత్యావసరాల ధరలను పెంచేయడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్న మైందన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి నాయకులు కాగితాల సత్యనారాయణ రెడ్డి, ముణి పైడయ్య, ఎర్నింటి రాము, సన్యాసి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణారావు

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు తెలిపారు. యువజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ పరిధిలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు, పౌర సమాజ సభ్యులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో పట్టణంలో స్పెషల్‌డ్రైవ్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృత స్థాయిలో చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అవగాహన కార్యక్రమాన్ని మరింత ఎక్కువమంది ప్రజలకు చేరేలా భవిష్యత్తులో మరింత విస్తృత ప్రచారం చేయాలని యునిసెఫ్ సంస్థను కోరారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ సంస్థ ప్రతినిధి చంద్రకళ, యువజనాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ ఎస్‌వి కృష్ణారావు, టిపిఆర్ఒ జగన్ మోహన్‌రావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17న పింఛనుదారుల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 17న పట్టణంలోని గాంధీబొమ్మ వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం ఇపిఎఫ్ కనీస పింఛను రూ.వెయ్యి అందిస్తోందని, ఇది సామాజిక పింఛను కంటే దారుణంగా ఉందని చెప్పారు. కార్మికుడు 35, 40 ఏళ్లపాటు సేవ చేస్తే లక్షల రూపాయలు ఇపిఎఫ్ కంట్రిబ్యూషన్‌కి జమవుతుందని తెలిపారు. అందులో పింఛను కింద రూ.వెయ్యి నెలకు ఇవ్వడం చాలా అన్యాయమన్నారు. కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని, కరోనా కాలంలో రద్దుచేసిన రైల్వే సీనియర్ సిటిజన్ రాయితీలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఢిల్లీలో అనేకమార్లు ఆందోళన చేసినప్పటికీ మోడీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వృద్ధుల పట్ల వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పెన్షనర్స్ డే సందర్భంగా శనివారం చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు నష్టపోవద్దు

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వేపాడ

దళారుల బారిన పడి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని బానాది గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రైతూ తన పంటని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి మోసాలకు తావు లేకుండా ఆర్‌బికెలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పారావు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, తహశీల్దార్ కృష్ణంరాజు, సర్పంచ్ యశోద, ఎంపిటిసి తులసి, ఎఒ యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని భర్తపురం ఆర్‌బికె వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కృష్ణమహంతిపురం పిఎసిఎస్ అధ్యక్షులు ఇందుకూరి రామరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని విక్రయించి, మద్దతుధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యులు బి.దేముడు, ఒంటి అప్పారావు, ఎంపిపి సండి సోమేశ్వరావు, ఎఒ రవీంద్ర, సర్పంచులు ఎస్.ఈశ్వరరావు, వై.వెంకటరమణ, డి.సన్యాసిదేముడు, వి.సత్యారావు పాల్గొన్నారు.



వేపాడ.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

క్రీడలతోనే విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్, జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన సంవత్సరాంత స్పోర్ట్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, పోల వెంకటరమణ పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యస్.జి.ఫ్ ఆధ్వర్యంలో అండర్ 14,17 టెన్నికాయిట్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలను వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడాలలో రాణించాలన్నారు. విద్యార్థులు మానసిక ఉల్లాశానికి ఆరోగ్యంగా ఉండటానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ వాసుదేవారావు, వైస్ ఎంపిపి పతివాడ రాజారావు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, శ్రీను, ప్రధాన ఉపాధ్యాయులు శ్యామల సాయి, స్కూల్ కమిటీ చైర్మన్ కరణపు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని వంగర పంచాయతీ పరిధిలో ముద్దానపేట నుండి పెదమానాపురం వరకు రోడ్డు పనులకు గురువారం ఎంపిపి గేదెల సింహాద్రి అప్పల నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం చేపట్టక అవస్థలు పడుతున్న ముద్దానపేట గ్రామానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవతో రోడ్డుకు 1.4 కోట్ల రూపాయలు మంజూరు కావడం సంతోషకరమన్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న గ్రామస్తులు రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి బమ్మిడి అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు, వంగర, పెదమానాపురం సర్పంచులు దత్తి నారాయణప్పలనాయుడు, గొటివాడ దాసు, జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు దత్తి చిరంజీవి, ఎంపిటిసి సభ్యులు వంగపండు కృష్ణమూర్తి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి